కథానిక

# జయం ఎవరది?

శ్రీమతి "ఉత్తరాషాఢ"

రాధ అప్పుడే హాస్పిటల్ నుండివచ్చి విశ్రాంతిగా కూర్చుని ఉంది. ప్రశాంతంగా ఉన్న నీలాకాశం వైపు దృష్టి సారించింది. జరిగిన నెలరోజులు తలంపునకు వచ్చాయి. అవి తన జీవితంలో మరపురాని రోజులు. ఏదో బాధ పడుతూంది. బాధ అని బాధగానూ లేదు. ఒక విధమైన సంతోషము. సంతోషమని పూర్తిగ అలాను చెప్పలేము. ఏదో ఆవేదన. రూపనిర్ణయం చేయలేని అనుభూతి. ఒక్కమారుగ దృష్టి కాలిమీదకు పోయింది. తన కాలిమీద మానుతున్న దెబ్బను చూస్తూంటే ఏదో జ్ఞాపకం వచ్చింది. ఈ చిన్న దెబ్బ తన జీవితంలో ఎంతమార్పు తెచ్చిపెట్టింది! తన ఆశయాలే మారిపోయి ఆదర్శాలు కొత్తత్రోవల పట్టాయి. ఇలాటి ఆలోచనలతో సతమతౌతూన్న రాధకు తమ్ముని పిలుపులు వినిపించనే లేదు. చివరకు అక్కా! అని తట్టిలేపటంతో రాధమళ్ళీ ఈప్రపంచంలో పడింది.

"ఏం, సుధా! ఎంతసేపయింది వచ్చి?" అంటూనే కాఫీ తేవటానికి వెళ్ళింది, కాస్త ధైర్యం తెచ్చుకుని మాట్లాడవచ్చును కదా అని. కాఫీ కప్పు తమ్ముడు చేతికి ఇచ్చింది. కాఫీత్రాగి కప్పుక్రింద పెడుతూ "అక్కా! ఈ రోజు మా కాలేజిలో ఏంజరిగిందీ తెలుసా!" అని సావధానంగా వివరిద్దామను కుంటున్నాడు సుధ.

మనస్సు చికాకుగా ఉంది. రోజులా తమ్ముడు చెప్పే కబుర్లు వింటానికి ఓపికలేదు. అందుకని "ఏం? జరిగింది? ఈరోజు కాలేజీనుండి రాగానే మొదలు పెడతావు గొడవ. రోజూ కాలేజిలో ఏంజరిగిందో రిసెర్చి చేస్తే బాగానే పరీక్ష పేసవుతావు. ఇంకా మూడు నెలలుకూడ లేవు పరీక్షలు" అంది.

ఎందు కక్కా! నీకంత కోపం ఈరోజు మా గేమ్ ఫైనల్స్. రేపటి సాయంకాలంనుండి ఎక్కడికి వెళ్ళను. కష్టపడి చదువుతాను. ఈ ఒక్కరోజు మరి వెళ్ళొద్దా! అంటూ మారాం చేశాడు.

గడియారం ఐదుగంటలు కొట్టింది. ఇంకో గంటలో శ్రీనివాసు వస్తాడు. మరి తనింకా ఇలానే కూచుంది. సుధ వెళ్ళటం మనస్సులో ఇష్టంఉన్నా పైకి మాత్రం "నీ ఇష్టం వెళ్ళి వేగంగా వచ్చేయి," అంది. ఓ అలాగే ఏడు గంటలకల్లా వచ్చెయ్యనూ" అన్నాడు.

తమ్ముడు వెళ్ళిన తరువాత ముస్తాబయింది. తనకుయిష్టం అయిన బంగారురంగు జార్జెట్ చీర కట్టుకుంది. పువ్వుల దండ పెట్టుకుంటూ అద్దంలో తన ప్రతిబింబం ఒక్క సారి చూచుకుంది. అబ్బా! ఈరోజు తనెంత అందంగా ఉంది! అనుకుంది. కాని వెంటనే ముఖంలో విషాదరేఖలు అల్లుకొన్నాయి. ఈలాగే కొన్నిసంవత్సరాలక్రితం ఈచీరెకట్టుకుని తనుఅద్దందగ్గిర నిలుచున్నసంఘటన జ్ఞాపకం వచ్చింది.

♦ ♦ ♦

రాధ అప్పుడు స్కూల్ ఫైనల్ చదువుతూండేంది. సన్నగ్గా పొడుగ్గా నాజూకుగ ఉండేది. గుండ్రని ముఖం తీర్చిదిద్దిన కనుబొమ్మలు ఆకర్షనీయమైనకండ్లు. రాధ అందమైన అమ్మాయి అని అందరూ అనుకునేవారు. పసినిమ్మ పండులాంటి ఆమె శరీరఛాయ అందానికి మెరుగుపెట్టింది. దానికితోడు ఆమె తెలివి తేటలుతోటి విద్యార్థులలో ఒక గౌరవ స్థానం తెచ్చిపెట్టాయి. స్నేహితులంతా రాధ అదృష్టవంతురాలనేవారు. చక్కని రూపం దానికి తోడు చదువు అల్లారు ముద్దుగచూచే తలిదండ్రులు. ప్రాణంగా చూచుకొని తనతోఆడుకునే చిట్టితమ్ముడు. రాధ స్కూల్

ఫైనల్ పరీక్ష కష్టపడి చదివింది. పరీక్ష పేసవటమే కాకుండా స్కూలుకి ఫస్ట్ వచ్చింది. ఈవిషయం స్కూలులో తెలియగానే రాధ సంతోషానికి మేరలేక పోయింది. ఊహాగానంలో ప్రక్కనున్న మహిళా కాలేజీ ప్రాంగణాలవైపు పోయింది. ఆనందంతో తాను కాలేజిలో జాయిన్ అవుతాననేవిషయం తండ్రికి చెప్పటానికి త్వరగా వచ్చింది. స్కూల్ ఫస్ట్ వచ్చిందనగానే రామనాథం గారు పరమానంద భరితుడయ్యాడు. తాను పడ్డ శ్రమ ఫలించింది. తండ్రికి తగ్గ కూతురనిపించుకుంది అనుకుంటూ ఏమేవ్ నిన్నే అని భార్యను పిలచాడు.

"ఎందుకండి" అంటూ లోపల్నుండి వచ్చింది కామాక్షమ్మ. "మనచిట్టి తల్లి స్కూల్ ఫస్ట్ వచ్చింది. మా రాధ. ఎంత పైచదువుకివెళ్ళినా ఫస్ట్ గా పేస్ అవుతుంది" అన్నాడు. ఆమాటమీద కామాక్షమ్మ "పోనీలెద్దురూ ఎంత చదువు చదువుకున్నా ఆడపిల్లకు పెండ్లి తప్పదుకదా సంసారం దిద్దుకుందికి తగిన విజ్ఞానం వచ్చింది. చదువుకి అంతేముంది. ఎంత చదివిన చదవాలనే ఉంటుంది. అందుకని మంచి సంబంధం చూచి పెండ్లి చెయ్యండి" "నేను మాత్రం కాదన్నానా ప్రయత్నం చెస్తూనే ఉన్నానుగా" అన్నాడు రామానాథం.

♦ ♦ ♦

పెండ్లివారు నాలుగు గంటల ట్రెయిన్ కే వస్తున్నారు, వేగం అన్ని సిద్ధం చెయ్యావే. పెద్ద అంతస్థు కలవారాయె పెండ్లి కొడుకు తండ్రి రిటైయిర్డు డెప్యూటి కలక్టర్ అన్నారు రామనాథంగారు భార్యను పిలచి "ఏమిటండి ఆకృష్ణాపురం సంబంధమేనా ఇప్పుడు వస్తున్నారూ"

"మరేమనుకున్నావు. అబ్బాయీ రూపానికిమన్మధుడు. 20, 21 టో సంవత్సరాలు ఉంటాయి. మెడిసన్ చదువుతున్నాడు. వారికి ఇష్టం అయిందా మనరాధ నిజంగా అదృష్టవంతురాలే అన్నాడు. అమాయకంగా తన చదువే సర్వస్వం అనుకునే రాధకు పాపం ఈ విషయమే తెలియదు పరీక్ష ఫలితాలు తెలిసినప్పటినుండి. రాధ దృష్టిఅంతా కాలేజిపైనే ఉంది. కాలేజి అంటే పై ఊరు వెళ్ళాలి. పైగ అందరూ అక్కడకు తనలాంటి అయినవారే వస్తారు. వారందరితోను తాను మిన్నగ ఉండాలి. అక్కడకూడా ఫస్ట్ వస్తే అమ్మ నాన్న ఎంత సంతోషిస్తారు. మరల తెచ్చుకోవటానికి తానెంతబాగ చదవాలి. అలాగని ఊహాగానంలో గాలిమేడలు నిర్మిస్తూ పత్రిక తిరగవేస్తున్న రాధకు అమ్మ పిలుపు వినిపించింది.

"చూడు నువ్విలా కూర్చోవటం కాదు. ఈ రోజున పెళ్ళివారు వస్తారు. జడ అదీ వేసుకోవెళ్ళి, అప్పుడే మీ నాన్నగారు స్టేషనుకికూడ వెళ్ళారుఅంది. కామాక్షమ్మ

ప్రశాంత వాతావరణంగల రాధ మనస్సులో అమ్మ మాటలు పెనుగాలివీచి సుడిగుండంఏర్పరచింది. పెండ్లివారు తననే చూస్తారనగానే తలమీద పిడుగుపడ్డట్లయింది. తను నిర్మించుకున్న గాలిమేడలు ఆ గాలివిసురుకి తన కళ్ళెదుట కూలిపోతున్నట్లనిపించింది. ఏమిటిది తన ఆశయాలకు అవరోధం. తన చదువుకు స్వస్తి. తను అప్పుడే వివాహం చేసికొని సంసారమనే జీవితయాత్ర నడిపే నావను సుక్కానిగా మారాలి. తనేం తప్పచేసింది? తన శాయశక్తులా కష్టపడి చదివి పరీక్ష పేస్ అయిందిగదా. మరి ఎందుకు అమ్మ నాన్నగారు తనను చూచినప్పుడల్లా ఎంతో బాధ పడతారు? కనిపెంచిన వారికి తనిప్పుడు బరువు అయిందా! పదహారేళ్ళయినా నిండలేదు అప్పుడే తనకు వివాహమా? అమ్మో తానుసంసారం చేయగలదా? ఆడుతూ పాడుతూ తిరిగే తనిప్పుడు అమ్మలా మారాలి అంతబాధ్యత తాను నిర్వహించగలదా? ఇలాంటి ఆలోచనలకు రాధ మనస్సులో అదిరి పోయింది.

"ఏమే. పుస్తకం మరి విడిచి పెట్టవా ఏమిటి? ఏదో స్కూలు పుస్తకాలే కాకుండ శలవులలో కూడ సుఖంగా ఉండనీయకుండ ఈ పత్రిక లొకటి వీళ్ళ ప్రాణాలమీదికి! బంగారు తల్లివికదూ! కాస్త వేగంగా ముస్తాబుకామ్మ." అంది కామాక్షమ్మ.

రాధకు అంతా అయోమయంగా ఉంది. నాకు పెళ్ళి వద్దు అని చెప్పటానికి అప్పుడే వారు వచ్చేస్తున్నారాయె. ఆలోచించి ఏ సమాధానం చెప్పటానికి తన తల పనిచేయటంలేదే. పెళ్ళివారొకరున్నారు వాళ్ళను మనయింటికి రమ్మనట్లు తనకు తెలియనే తెలియదు. ప్రతివిషయం మరి నాన్నగారు తనతో చెప్పేవారు కదా ఏమిటి ఇప్పుడీ విపరీతం? తనమీద వాళ్ళకింత స్వతంత్రం ఏమిటి అనుకుంది కాని, అమ్మ మాటకు ఎదురు చెప్పలేదు. ఏచీర కట్టుకోవాలా అని ఆలోచించింది. నాన్నగారు మెడ్రాస్ వెళ్ళినప్పుడు గోల్డ్ కలర్ జార్జెట్ చీర ఎదురు స్టేండుమీద తననే కట్టుకోమన్నట్లు రాధ దృష్టిలో పడింది. ఔను ఆ చీరంటే తనకు ప్రాణం. ఆచీర తనకు ఎంతగానో నప్పుతుందని తను ఒకసారి కట్టుకుంటే "నీచీర నీరంగులో కలిసిపోయిందే ఎంత బావుందే నీకు" అన్న తన స్నేహితురాలు కమల మాటలు జ్ఞాపకము వచ్చాయి. బంగారు బొమ్మలా తయారైంది. దొడ్లో విచ్చిన కనకాంబరాలు

ట్టినమాల అమ్మ యిచ్చింది. కనకాంబరాలంటే రాధకు తగని ఇష్టం. అద్దం ఎదురుగ నిలబడి మాల జడలో పెట్టుకుంటూ తన ప్రతి బింబాన్ని ఒక్కసారిచూచి విజయగర్వం పొందింది రాధ. ఆనీరోజు ఎంత అందంగా కనుపించింది. సహజసౌందర్యానికి అలంకరణతో మెరుగు పెట్టినట్లుంది ఈరోజు పెండ్లివారు వస్తున్నారు. తన రూపాన్ని చూచి మంత్రముగ్ధులు కావాలి ఇలాగ అనుకుంటూండే సరికి కారు చప్పుడయింది. సుధ దిగి లోనికి పరిగెత్తుకుంటూ వచ్చాడు "అమ్మా! అమ్మా పెళ్ళివారొచ్చారంటూ" తనచుట్టూతిరుగుతూ చప్పట్లు కొట్టటం ప్రారంభించాడు.

“ఇదిగో వాళ్ళొచ్చారు, రా !” అంటూ భార్యనుపిలిచి రామనాథం రాధ తలుపుచాటునుండి చూస్తూనే ఉంది. ఇంతలో అరవై ఏండ్ల వయస్సుంటుంది. ఒక ముసలాయన చేతిలో చేతికఱ్ఱ. జరీకండువా ముసలివాడైనా వేషానికిఏమి లోటు లేకుండ ఉన్నాడు. వెంబడినే మరొకాయన సుమారు నలభై సంవత్సరాలు ఉండవచ్చు. బక్కపలుచగ ఉన్నాడు. అదే ముఖము పోలికలున్న ఒకామె వచ్చింది. ఏభై సంవత్సరాలుంటాయి. ఆమె వెనుకాల ఇరవై ఇరవై రెండేండ్ల వయస్సుగల అబ్బాయి వచ్చాడు. ముఖం చక్కగఉంది. తీర్చిదిద్దిన పెద్దకళ్ళు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి. చామనఛాయ తెల్లని బట్టలు వేసుకున్నాడు. మనిషిలో హుందాతనం కనుపించిన నిరాడంబరంగ ఉండే వ్యక్తిలా కనుపించాడు. చూస్తే మరొకసారి చూడాలనిపించింది రాధకు. ఇంతకు పూర్వం తను అందమయినదని పొగడ్తలను పొందటమేగాని తన పొగడ్తలందుకునే వ్యక్తి కనుపించలేదు. మగవారంతా కూర్చుని ఇష్టాగోష్టిగ కొంత సేపు మాటలాడిన అనంతరం అమ్మ వచ్చి తనను తీసుకొని వెళ్ళి అక్కడ కూర్చోపెట్టింది. వారి మాటలలో వచ్చిన వారు పెండ్లి కొడుకు తండ్రి తల్లి మేనమామ గ్రహించింది. ఇంతసేపై తనుచూద్దామనుకొన్న వ్యక్తి తన కంటెదుట ఉన్నాకన్నెత్తి చూడటానికి భయం వేసింది.

ఆముసలావిడ “అమ్మాయి, నీ పేరేమిటమ్మా !” అని అడిగింది.

“రాధ” అంది మెల్లగా

“ఏంచదువుకున్నావమ్మా ?” అంది.

స్కూల్ ఫైనల్ పరీక్ష మొన్ననే పాస్ అయింది అంది కామాక్షమ్మ. కుమార్తెకు వేసిన ప్రశ్నకు తానే సమాధానం ఇస్తూ.

కొంతసేపు లోకాభిరామాయణం మాట్లాడుకున్నారు. తన విషయం ప్రస్తావించకుండ ఉన్నందుకు బ్రతికేనురా భగవంతుడా అనుకుంది. తరువాత పెండ్లి కొడుకు మేనమామ మేనల్లుని గొప్పలు చెప్పటం మొదలు పెట్టేడు. స్కూల్ ఫైనల్ లో ప్రెసిడెన్సిలో ఫస్ట్టు, ఇంటర్ లో యూనివర్సిటి ఫస్ట్ట. అతని తెలివి తేటలు అపారం అని ఆ పొగడ్త వింటూంటే రాధకు ఒళ్ళు మండింది. ఎవరి వాళ్ళను గూర్చి వాళ్ళు తదేకంగా స్తుతిస్తే తనకు ఇష్టం ఉండదు. తను మాత్రం స్కూల్ ఫస్ట్ రాలేదా ! మరి తన్నుగూర్చి అమ్మ చెప్పిందా తను ఇంకా చదువుతే తనకీ వస్తుంది. యూనివర్సిటి ఫస్ట్ అనుకుంది. తరువాత తిరిగి ఉత్తరం వ్రాస్తామంటూ లేచారు.

మూడురోజుల అనంతరం ఒక ఉత్తరం వచ్చింది. పిల్ల వాళ్ళ అబ్బాయికి నచ్చిందని కాని అబ్బాయి మెడిసెన్ చదువు తున్నాడు గనుక పదివేల రూపాయలు కట్నం ఇవ్వాలని వ్రాశారు. ఆ వాక్యం చదువుతూండగానే ఉత్తరం చేతిలోంచి జారిపోయింది. రామనాథంగారికి పిచ్చెక్కినట్లయింది. దృష్టిలో చలనం లేకపోయింది. పదివేలని అప్రయత్నంగా నోట్లోంచి మాటలు వస్తున్నాయి. ఉద్యోగం హెడ్ మాస్టరు, తెచ్చింది నిత్య జీవితావానికి లోటు లేదుకాని పదివేలు అంటే ఎలా తెస్తాడు? సుధ ఇంక చిన్నవాడు. మరికొద్దిసంవత్సరాలలో తను రిటెయిర్ అయిపోతాడు. ప్రావిడెంటు ఫండ్ వస్తుందంటే మరి అబ్బాయి చదువు చెప్పించొద్దూ. పోని అదంతా పడి వూడ్చిపెట్టినా పదివేలు తేలేదు. ఇలాంటి ఆలోచనలలో పడి ఏమి చేయాలో తోచలేదు రామనాథంగారికి.

రాధ సమాచారం అంతా గ్రహించింది. కానిఎటూచెప్ప లేకపోయింది. ఒకమూల ఆత్మగౌరవం దెబ్బతింది. ఆడపిల్లనైపుట్టి కన్నవారిని యిలాబాధ పెట్టేకన్నా ఏచెట్టయో పుట్టిన బాగుండేది అనుకుంది రాత్రంత నిద్రపట్టలేదు. తన భవిష్యత్తునుగూర్చి ఆలోచనలు సాగాయి ఏం తను చదువుకుంటే నాన్న సర్వీసు ఇంక ఆరు సంవత్సరాలుంది కదా. తాను పెద్దచదువు చదివి ఉద్యోగం చేయాలి. తమ్ముడికి చదువు చెప్పించాలి. కొడుకై పుడితే ఆబాధ్యత నిర్వహించదూ? డబ్బుతో విలువలు కట్టె మనుషులకు బుద్ధిచెప్పాలి. ఆమ్మాయిలంతా డబ్బు పుచ్చుకుంటే వివాహం చేసుకోమని సమ్మెచేస్తే ఎంతబాగుండునూ అనుకుంది. ఒకరి విషయం తనకెందుకు, తను మాత్రం ప్రయోజకురాలు కావాలి ఆ విషయం నాన్నగారితో చెప్పాలనుకుంది. మరుచటిరోజున తనచదువు విషయమై తండ్రితో ప్రస్తావించింది రామనాథంగారు అభ్యంతరం పెట్టలేదు.

ఇంట్లో ఉంటే అమ్మాయి మనస్సు సాడౌవుతుందని ఇంటర్ చదవటానికి పంపించారు. ఇంతకు మునుపు చదువు వంతవ కేవలం విద్యమీద అభిలాషతో కూడింది. ఇప్పుడు కేవలంబాధంతాయుతమైంది. కార్యదీక్షతో చదువుతూంది. యింటర్ ఫస్ట్‌క్లాసులో పాస్ అయింది. తండ్రితో మెడిసన్ చదువుతానని అడిగింది. పెండ్లిచేసి సంతోష పెట్టలేక పోయిన చదువుకైన అమ్మాయి సంతోషిస్తుందని తండ్రి అడ్డు పెట్టలేదు. ఐదుసంవత్సరములుయిట్టేగడిచిపోయాయి.

ఇప్పుడు తను డాక్టర్ రాధ అయింది. ఇంతలో సుధ స్కూల్ ఫైనల్ పాస్ అయ్యాడు. రాధను గుంటూరులో సర్జనుగావెళ్తు "నాకు సహాయంగా ఉంటాడు సుధనుకూడ తీసుకు వెళ్తాను నాన్న" అని అడిగింది. అలాగే తల్లి అన్నాడు రామనాధంగారు. అక్క తమ్ముడు గుంటూరు వచ్చారు, తమ్ముడు ఇంటరులో ప్రవేశించాడు. రాధ డాక్టరుగాఉండేది. ఇంటికి రాగానే తమ్ముడితో హాయిగా కాలక్షేపం అయ్యేది రాధకు.

ఆరోజు ఆదివారం సుధ మంచిసినిమా వచ్చింది వెళదామక్కా. అన్నాడు. సరే నేను వేగమే వచ్చేస్తాను వెళదామంది.

సాయంత్రం ఆరుగంటలయింది. తొందరగ పని ముగించుకొని ఇంటికివెళ్ళిపోతూంది. చీకటిపడుతూంది. స్కూటర్ మీద ఎవరో వ్యక్తి తనకెదురుగా వస్తున్నాడు. మనిషి చూస్తే ఎక్కడో చూచిన ముఖములా ఉంది. అయిన ఎవరైతే తనకెందుకు రోజుకి వందమందిని చూస్తావుంటాము. ఇలాటి వార్ని. ఇలాగ అనుకుంటూ అడుగులు వేస్తుంది. ఇంతలోనే వెనుక తనకాళ్ళలో ఏమిటో పడినట్లయింది. వెంటనే వెనుకకు తిరిగి చూచింది అమ్మో ! అంది.

ఇంకేముంది కాలిమీంచి స్కూటర్ వెళ్ళింది. అమ్మా! అంటూ పడిపోయింది. వెంటనే స్కూటర్ ఆపాడు ఆ వ్యక్తి. పాపం మొహం తిరిగింది భయంచేత. కాలునుండి రక్తం ధారగ ప్రవహిస్తూంది. దగ్గరికి వచ్చి చూచాడు. ఆమె చేతిలో సెతస్కోపు కనుపించింది. అమ్మో ఈ అమ్మాయి ఒక డాక్టరే తనలా ! ఏమీ తోచలేదు. ఒక టాక్సీ పిలిచి అందులోకి ఎక్కించి మెల్లగ తన ఇంటికి చేర్చాడు. హాస్పిటల్‌కు అయితే తను రేష్‌గా డ్రైవ్ చేశాడనే అంటారు. కాని ఆ అమ్మాయిది తప్పునరుగ.

ఇంతకీ ఇంటికి తీసికొని వెళ్ళి ఏదైనా మందు వెయ్యొచ్చునని ఇంటికి తీసికొనిపోయాడు.

నౌకరుకుట్టాడు రాముని కాఫీ ప్రిపేర్ చేయమన్నాడు. రాధకు యింక తెలివి రాలేదు. ముందు మందు వేసి కాలు కట్టుకట్టాడు. ఎప్పుడు తెలివి వస్తుందా అని ఆత్రంగా చూస్తూ ఉన్నాడు. ముఖం ప్రశాంతవదనం చూస్తూంటే ఏదోలా అనిపించింది. అతనికి ఆ అమ్మాయి నిద్రపోతున్నట్లున్నా ఎంత అందంగ ఉంది అనుకున్నాడు. ముఖంనవ్వుతున్నట్లుంది. తాను ఏదో వింత అనుభూతి అనుభవిస్తున్నట్లుంది.

ఇంతలో మెల్లగ రాధ కళ్ళువిప్పింది బాగ తెలివివచ్చింది. నాలుగు వైపుల చూచింది. తనవైపు చూస్తున్నాడొకవ్యక్తి ఏమిటి తను ఎక్కడ ఉంది? అనుకుంది వెంటనే దిగ్గున లేవబోయింది. కాని కాలుకదపటంతో బాధ తెలిసి "అమ్మా" అంటూ మంచంమీద వాలిపోయింది.

"అయ్యో మీరు లేవకండి. గాయం పెద్దది తగిలింది. కొంచెం రెస్ట్ అవసరం. మీకు తెలిసిందేగా కొంచెం కాఫీ త్రాగండి" అంటూ కాఫీ ఇచ్చాడు. దాహం ఎక్కువగ ఉంది. పైగ నీరసంగా, ఉన్న రాధకు కాఫీ అమృతంలా కనుపించింది. దెబ్బ తగిలినప్పటినుండి జరిగినవిషయం అంతా వివరించాడు. రాధ అతను చేసిన సహాయానికి కృతజ్ఞత తెలుపుతూ మీ రెవరో తెలుసుకోవచ్చా అంది. తన పేరు శ్రీనివాసని తాను డాక్టరుగా హాస్పిటల్ లో పని చేస్తున్నట్లు చెప్పాడు. మరి మీరెవరో తెలుసుకోవచ్చా అని అడిగేడు. "నా పేరు రాధ అంది మెడిసన్ క్రిందటి సంవత్సరమే పూర్తయింది. ఇప్పుడు ఇక్కడహాస్పిటల్ లో హౌస్ సర్జన్"గా ఉన్నానుఅంది.

రాధ అనగానే ఏదో గుర్తువచ్చింది శ్రీనివాసుకి కొన్ని సంవత్సరముల క్రితం తను చూచిన అమ్మాయి పేరు కూడ రాధేమో ఆరాధ ఈమె కాదుగదా అనుకున్నాడు. మనిషి చూస్తే అలాగే ఉంది.

ఇంతలో రాధ నేను "మాయింటికి వెళ్ళాలి. దయచేసి ఓ టాక్సి తెప్పిస్తారా మా తమ్ముడు నా కోసం చూస్తూ ఉంటాడు. తప్పకుండ వెళ్ళాలి. పిలిపించండి.

మీరు చేసినమేలు మరచిపోలేనుఅంది. రాధ మాటకు అడ్డుచెప్పలేక పోయాడు శ్రీనివాసు. "నేను దిగబెడతాను లెండి" అన్నాడు.

ఇంటివద్ద సుధ అక్కకోసం వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నాడు.

రాధను దిగబెట్టి తాను ఇంటికి వెళ్ళిపోయాడు. రాత్రి పడుకున్నా డన్నమాటే కాని నిద్రపట్టలేదు శ్రీనివాసుకి.

రాధగురించే ఆలోచనలు సాగాయి. తను తొలిసారిగా రాధను చూచినప్పుడే రాధను తప్ప మరి ఎవరిని వివాహం చేసుకోకూడదనుకున్నాడు. అందుకేగా ఇన్నిసంవత్సరాల నుండి అమ్మా నాన్న ఎంత చెప్పిన తను వివాహం చేసుకోకుండ ఉన్నది. ఎవరి కోసమైతే తను నిరీక్షిస్తున్నాడో ఆ అందాల రాధని మళ్ళీ ఇప్పుడు కలుసు కొన్నాడు. వెదకుతున్న తీగ కాళ్ళకు చుట్టుకున్నట్లు.

రోజు రాధను చూట్టానికి వెళ్ళేవాడు. వారి ఇరువురి సమాగమం స్నేహంగా మారింది. ఈ విషయం తండ్రితో చెప్పాలనుకుంది. తనలా సాటి ఉద్యోగి; పైగా కట్నం లేదుగ నాన్నకు బాధఉండదు అనుకుంది. కాని శ్రీనివాసు కొంపతీసి తన చిన్నప్పుడు చూడటానికి వచ్చిన అబ్బాయి కాదుకదా అనుకుంది మరి తనప్పుడు సరిగ చూడలేదు. అయిన ఇంత విశాల భూప్రపంచంలో అతనే ఉన్నాడా అనుకుంది. ఇతనిని వివాహంచేసికొని డబ్బుతో మనుష్యుల విలువలు కట్టే వారికి బుద్ధి చెప్పాలనుకుంది.....

రాధ ఎంతసేపు అలా అద్దం ఎదురుగా నిలబడి ఉందో తనకీ తెలియలేదు. మళ్ళీ శ్రీనివాసు వచ్చి భుజంమీదతట్టే వరకు తనకు తెలియనేలేదు. "ఏమిటిరాధ? ఏమిటి విశేషం ఈరోజు అద్దం ఎదురుగా నిల్చుని అలాదీర్ఘాలోచన చేస్తున్నావు" అన్నాడు

"అబ్బే ఏమిలేదు ఏదోజ్ఞాపకము వచ్చింది" అంది.

"అబద్ధం నాదగ్గర దాచటందేనికి?" అన్నాడు.

"నీవు మాటలతో లేదని చెప్తూన్న నీముఖం చెప్తూందిగ ఏదోవుందని లేకపోతే ఎప్పుడు నవ్వుతూ ఉండే రాధ ఈరోజెందుకు అలా విచారంగ కన్పిస్తుంది. నామీద ఎందుకైన కోపంవచ్చిందా" అన్నాడు.

"నాకేం కోపం లేదుకాని మరి నేనొకవిషయం అడుగుతాను చెప్పాలి" అంది.

"ఓ అలాగే" అన్నాడు.

"మీ దేవూరు మీ నాన్నగారు ఏంచేస్తున్నారు" అంది.

"ఇన్నాళ్ళనుండి లేని ధర్మసందేహం నీకీరోజునే ఎలా వచ్చింది? అయిన మీకు కొత్త వాళ్ళేమి కాదులే. మాది గుడివాడ దగ్గిర కృష్ణాపురం మా నాన్నగారు సోమశేఖరం గారు. "రిటైయిర్డ్ డిప్యూటి కలక్టర్"

ఏమిటి? అంటూ కుర్చీలో కూలబడింది. ఏమిటిది తను ఏవరికైతే బుద్ధి చెప్పాలనుకుందో అతనికే తన హృదయంలో స్థానం యిచ్చింది!

"ఏమిటిరాధ ఏమిటి అలాగ ఫీలవుతున్నావు."

"ఏమిలేదు నేను అనుకున్న దొకటి జరిగిన దొకటి నేను పెట్టుకున్న ఆదర్శాలన్నీ పరాజయం పొందాయి."

"ఏం? నీఆదర్శాలేమిటో తెలుసుకోవచ్చా" అన్నాడు.

"డబ్బుతో మనుషులకు విలువలు కట్టి విద్యావంతులైన సంస్కారములేని యువకులకు బుద్ధి చెప్పాలనుకున్నాను."

"ఇప్పుడేం జరిగింది? నేను కట్నంకోసం ఆశిస్తున్నాననుకున్నావా?"

'అబ్బే! ఎంతోలేదు పదివేలేగా వెనుకమీరడుగలేదూ?'

"వివాహ మనేది చేసుకుంటే నీతో నేనని ఏనాడో నిర్ణయించుకొన్నాను. కాని అప్పుడు ఆర్థిక స్వాతంత్ర్యము లేదు."

"అయితేజయంనాదే నాఆశయాలుఫలించాయి" అంది.

"ఏం? ఎలాగ?" అన్నాడు నవ్వుతూ.

'చూశారా కట్నంలేకుండ ఎలాగఒప్పించానో' అంది.

"అయినా ఇప్పుడుపుచ్చుకుంటే చట్టం ఊరుకోదుగా!!

ఇంతలో తమ్ముడు సుధ తొందరగ వచ్చి "అక్కా! మేము గెలిచాము. ఫైనల్స్‌లో" అన్నాడు.

అందరి ఆశయాలు జయం పొందాయని గడియారం గంటలు కొట్టింది.